నమస్తే తెలంగాణ

# ఆదిలాబాద్-నిర్మల్

5 | నిజామాబాద్ సోమవారం 12 ఆగస్టు 2024 | ADILABAD NIRMAL




బోథ్ కోర్టు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న న్యాయమూర్తులు

## నాలుగో ఉద్యోగానికి ఎంపిక

ఉట్నూర్, ఆగస్టు 11 : ఉట్నూర్ పట్టణానికి చెందిన గిరిజన యువకుడు జాదవ్ దిలీప్ కుమార్ నాలుగు ఉద్యోగాలు సాధించి తన సత్తా చాటాడు. దిలీప్ పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో ప్రాథమిక విద్యను పూర్తి చేశాడు. బోధన్‌లోని ఉషోదయ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, హైదరాబాద్‌లో ఇంజినీరింగ్ చదివాడు. 2016 సంవత్సరంలో పోటీ పరీక్షలు రాశాడు. ట్రాన్స్‌పోర్ట్, ఎక్సైజ్, ఫైర్ కానిస్టేబుల్స్ మూడు పోస్టులకు ఎంపికయ్యాడు. ప్రస్తుతం ఫైర్ కానిస్టేబుల్‌గా ఉట్నూర్‌లో విధులు నిర్వహించి ఖానాపూర్‌కు బదిలీపై వెళ్లాడు. తాజాగా ఇటీవల ట్రాన్స్‌కోలో జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్‌గా ఎంపికయ్యాడు. దీంతో నాలుగో ఉద్యోగానికి అర్హత సాధించారు. త్వరలోనే ట్రాన్స్ కో లో చేరుతున్నట్లు పేర్కొన్నారు. ఒక వైపు విధులు నిర్వహిస్తూనే మరో ఉద్యోగం సాధించడంతో కుటుంబీకులు, శ్రేయోబిలాషులు అభినందనలు తెలుపుతున్నారు.



ట్రాన్స్‌కో ఉద్యోగానికి ఎంపికైన దిలీప్

# కోర్టు పనులను త్వరగా పూర్తి చేయాలి

### హైకోర్టు న్యాయమూర్తులు

బోథ్, ఆగస్టు 11 : బోథ్‌లో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని హైకోర్టు న్యాయమూర్తులు టి.వినోద్‌కుమార్, సృజన కలసికం, లక్ష్మణ్ అన్నారు. ఆదివారం బోథ్ మండల కేంద్రంలో రూ.12.75 కోట్లతో నిర్మించనున్న కోర్టు భవనం, న్యాయమూర్తి నివాస గృహ నిర్మాణ పనులకు జిల్లా జడ్జి ప్రభాకర్‌రావ్, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలంతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భవన నిర్మాణ పనులను గడువులోగా పూర్తి చేస్తే కేసులు సత్వరమే పరిష్కరించే వీలు కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బోథ్, ఉట్నూర్, ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వామన్ రావ్ దేశ్‌పాండే, నగేశ్, బాపురెడ్డి, పీపీ రమణరెడ్డి, ఏజీపీ పంద్రం శంకర్, ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, స్థానిక కోర్టు సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, బోథ్, ఇచ్చోడ సీఐలు రమేశ్, భీమేశ్, తహసీల్దార్ సుభాష్ చందర్, ఎంపీడీవో జీవన్‌రెడ్డి, స్థానిక ఎస్సై రాము పాల్గొన్నారు. అంతకు ముందు కోర్టు ఆవరణలో న్యాయమూర్తులు మొక్కలు నాటారు.

# కాలం చెల్లిన మందులతో వైద్యం

## పేదల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న కాంగ్రెస్ సర్కారు

- తాజాగా ఖానాపూర్‌లో గడువు తీరిన సెలైన్ ఎక్కించిన సిబ్బంది
- ప్రభుత్వ దవాఖాన అని నమ్మకంతో వస్తే ఇష్టారీతిన చికిత్స
- సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లో తీవ్రంగా మందుల కొరత
- ప్రైవేటు మెడికల్ దుకాణాలకే మెడిసిన్ కోసం సిఫారసు

నిర్మల్, ఆగస్టు 11(నమస్తే తెలంగాణ) : నిర్మల్ జిల్లాలో కొంతకాలంగా సర్కారు వైద్యం దారి తప్పుతున్నది. కేసీఆర్ హయాంలో పేదలకు మెరుగైన వైద్యాన్ని అందించడానికి సర్కారు దవాఖానలకు కోట్లాది రూపాయలను విడుదల చేసి కార్పొరేటు స్థాయి వైద్యాన్ని చేరువ చేసిన విషయం తెలిసిందే. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ ఆసుపత్రులన్నీ సమస్యలతో సతమతం అవుతున్నాయి. జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రితోపాటు ఖానాపూర్, భైంసా పట్టణాల్లోని ఏరియా ఆసుపత్రులు, 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వాటికి అనుబంధంగా ఉన్న సబ్‌సెంటర్లలో పేదలకు పూర్తి స్థాయిలో వైద్య సహాయం అందడం లేదు. మందులు, సదుపాయాలు కల్పించడంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్న విమర్శలు ఉన్నాయి. మందులు, నిధులను విడుదల చేయకపోవడంతో సర్కారు దవాఖానల పరిస్థితి గందరగోళంగా మారుతున్నది. వైద్యులు, సిబ్బంది సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ ఆసుపత్రుల్లో సరిపడా మందులు లేకపోవడంతో సేవలందించలేకపోతున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ప్రజలు విష జ్వరాలు, డెంగ్యూ లాంటి ప్రాణాంతక వ్యాధుల భారిన పడి చికిత్సల కోసం ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం లేక ప్రైవేటులో చికిత్సలు పొందుతూ జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. అయితే జిల్లాకు మందులను సరఫరా చేసే ఆదిలాబాద్‌లోని సెంట్రల్ డ్రగ్ స్టోర్ (సీడీఎస్)లో ప్రస్తుతం మందుల కొరత తీవ్ర రూపం దాల్చింది. ఈ నేపథ్యంలో ఆయా ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది అరకొర మందులతోనే సేవలను కొనసాగిస్తున్నారు.





ఖానాపూర్ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా దవాఖాన



ఇటీవల దవాఖానలో గుర్తించిన కాలం చెల్లిన మందులు

### కాలం చెల్లిన మందులతో చికిత్స

ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాలం చెల్లిన మందులతో సేవలందిస్తూ ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఇటీవల ఖానాపూర్ పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో కాలం చెల్లిన సెలైన్ బాటిల్ ఎక్కించడంతో కడెం మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన ఓ రోగి అస్వస్థకు గురయ్యాడు. ఐదు నెలల క్రితమే సెలైన్ బాటిల్ గడువు తీరినప్పటికీ ఇంకా ఆసుపత్రిలో నిల్వ ఉండడంపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. సదరు రోగి తమ్ముడు సెలైన్ బాటిల్‌ను పరిశీలించడం వల్ల గడువు తేదీ తెలిసింది. లేకుంటే ఈ విషయం బయటకు తెలిసేది కాదు. కాలం చెల్లిన సెలైన్ ఇవ్వడానికి కారకులైన ఫార్మసిస్టు సునీత, స్టాఫ్‌నర్సు చంద్రకళను కలెక్టర్ సస్పెండ్ చేశారు. అలాగే విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ వంశీ, ఫార్మసిస్టు శ్రీనివాసాచారి, వైద్య సిబ్బంది ఎం.విజయ్‌కుమార్, వెంకటేశ్, కల్యాణిలకు మెమో జారీ చేశారు. అయితే జిల్లా డ్రగ్‌స్టోర్ నుండే సరఫరా అయిన సెలైన్ బాటిళ్లను రోగులకు అందిస్తున్నామే తప్ప, ఇందులో తమ పాత్ర ఏమీ లేదని సస్పెన్షన్‌కు గురైన సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




మార్చి-2024 గడువు తేదీ ఉన్న సెలైన్ బాటిల్

ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా తాము బలి కావాల్సి వస్తున్నదని ఉద్యోగులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన ప్రభుత్వం ఈ దిశగా దృష్టి సారించి సర్కారు దవాఖానలకు పూర్తిస్థాయి మందులతోపాటు సౌకర్యాల కోసం అవసరమైన నిధులను విడుదల చేయాలని కోరుతున్నారు.

### పెద్దాసుపత్రి అని వచ్చిన..

*మాది కడెం మండలంలోని లింగాపూర్ గ్రామం. నాలుగైదు రోజుల నుంచి జ్వరం, నొప్పులు ఎక్కువ కావడంతో ఈ నెల 9న ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన. అదేరోజు డాక్టర్ పరీక్షించి జ్వరం ఎక్కువగా ఉండడంతో ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. నాలుగు ఇంజక్షన్లు ఇచ్చిన తర్వాత సెలైన్ బాటిల్ ఎక్కించారు. కొద్ది సేపటి తర్వాత నాతో వచ్చిన మా తమ్ముడు సెలైన్ బాటిల్‌పై ఎక్స్‌పైరీ తేదీ చూసి వెంటనే సిబ్బందికి తెలియజేసిండు. అది ఐదు నెలల కిందటనే గడువు అయింది. మా తమ్ముడు చూడబట్టి కొద్దిలో ప్రాణాపాయం తప్పింది. పెద్దాసుపత్రి అని వస్తే ఇక్కడ పరిస్థితి ఘోరంగా ఉందని వాపోయాడు.*

*- అజారుద్దీన్, బాధితుడు, లింగాపూర్, కడెం మండలం.*





మాట్లాడుతున్న ఏఎస్పీ అవినాశ్ కుమార్

# నేరాల నియంత్రణకు సోదాలు

### ఏఎస్పీ అవినాశ్ కుమార్

భైంసా, ఆగస్టు 11 : అసాంఘిక శక్తుల ఆట కట్టించడంతోపాటు నేరాలను నియంత్రించేందుకు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రొగ్రాం నిర్వహిస్తున్నట్లు ఏఎస్పీ అవినాశ్ కుమార్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని కుంట ఏరియాలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రొగ్రాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతలను కాపాడడంతోపాటు ప్రజలలో భరోసా కల్పించేందుకు కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నామన తెలిపారు. అనుమానితులు ఎవరైనా తమ ప్రాంతంలో వచ్చి నివాసముంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని, వారిపైన ఏమైనా నేర చరిత్ర ఉందా? అనే విషయాన్ని ఆరా తీస్తామని అన్నారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 102 ద్విచక్రవాహనాలు, ఎనిమిది ఆటోలు, ఒక కారును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కార్డన్‌సెర్చ్‌లో పట్టణ సీఐ రాజారెడ్డి పాల్గొన్నారు.



రాస్తారోకో నిర్వహిస్తున్న మాల సంఘం నాయకులు

# మాల సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో

తలమడుగు, ఆగస్టు 11 : ఎస్సీ వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా ఆదివారం మాల సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. తలమడుగు మండలంలోని సుంకిడి గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహారాష్ట్రకు వెళ్లే అంతర్రాష్ట్ర రోడ్డుపై సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు గుకుంటి క్రాంతికుమార్ మాట్లాడుతూ.. ఎస్సీలందరూ ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నిమ్మల గజానంద్, గౌరవ అధ్యక్షుడు ముక్కల రాజేశ్వర్, ట్రెజరీ మగ్గిడి ప్రకాశ్, వైస్ ప్రెసిడెం ట్ రమాకాంత్, ముఖ్య సలహాదారులు నేతుల గంగన్న, గడుగు పొచ్చన్న, బొండ్ల రమేశ్, ప్రవీణ్, దేవన్న, అఖిలేశ్, నరేశ్, ప్రతాప్, వినోద్, దేవదాస్, మల్లేశ్, కృష్ణ, దేవల్ల స్వామి, మొట్టే అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# 13న గుండె ఉచిత వైద్య శిబిరం

ఎదులాపురం, ఆగస్టు 11 : రిమ్స్‌లోని డైస్ సెంటర్‌లో చిన్నారులకు ఈనెల 13న ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ తెలిపారు. ఆర్‌బీఎస్‌కేలో 18 ఏండ్లలోపు వయసు గల పిల్లలకు గుండె సంబంధిత సమస్యలకు పరీక్షలు చేయనున్నారు. సికింద్రాబాద్ కిమ్స్‌లోని పీడియాట్రిక్ కార్డియాలజిస్టులు బాధిత చిన్నారులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్యం అందజేస్తారని పేర్కొన్నారు.

# 108లో ప్రసవం

ఇచ్చోడ, ఆగస్టు 11 : సిరికొండ మండలంలోని బోరింగూడ గ్రామానికి చెందిన దుర్పథబాయికి ఆదివారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. హుటాహుటిన అంబులెన్స్ బోరింగూడకు చేరుకుని దవాఖానకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో నొప్పులు అధికం కావడంతో సిబ్బంది ప్రసవం చేశారు. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని తెలిపారు. దుర్పథబాయిని పిట్టబొంగరం పీహెచ్‌సీకి తరలించామని ఈఎం టీ కాశీనాథ్, పైలట్ గోపీనాథ్ తెలిపారు.



శిశువును తల్లికి అందజేస్తున్న అంబులెన్స్ సిబ్బంది



లంబాడా వేషధారణలో యువతులు

# తీజ్ షూటింగ్ సందడి

*లంబాడాల పవిత్ర పండుగ తీజ్. తీజ్ ఉత్సవాలపై ఇంద్రవెల్లి మండలంలోని హర్కాపూర్ తండాలో ఆదివారం షూటింగ్ నిర్వహించారు. యువతులు లంబాడా వేషధారణలో ఆకట్టుకున్నారు. నృత్యాలు చేశారు. పెద్దలు, చిన్నలు, యువతులు ఆడిపడారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ ఉమాజీ నాయక్, రాథోడ్ రోహిదాస్ డావ్, మాజీ సర్పంచ్, సేవాలాల్ ధర్మ ప్రచారక్ ఆడె ప్రేమ్ సింగ్ పాల్గొన్నారు.*

*- ఆదిలాబాద్ ఫొటోగ్రాఫర్, ఆగస్టు 11*



అక్షరాభ్యాస మండపంలో భక్తుల రద్దీ

# అమ్మవారి సన్నిధిలో భక్తుల రద్దీ

బాసర, ఆగస్టు 11 : సరస్వతీ అమ్మవారి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. ఆదివారం సెలవు కావడంతోపాటు శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు గంటలపాటు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సందర్భంగా తమ చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాధికారులు ఏర్పాట్లు చేశారు.

# పేలిన మందు గుండు సామగ్రి

సోన్, ఆగస్టు 11 : సోన్ శివారులో బండరాళ్లను పగులగొట్టే మందు గుండు సామగ్రిని నిల్వ ఉంచారు. ఒర్సు రాకేశ్ అనే కార్మికుడు పెద్ద బండరాళ్లకు రంధ్రాలు చేసి అందులో పెట్టే క్రమంలో హఠాత్తుగా మందుగుండు సామగ్రి పేలింది. ఆ ప్రమాదంలో రాకేశ్ చేతివేళ్లు తెగిపోయాయి. పొట్ట, తొడ భాగంలో తీవ్ర గాయలయ్యాయి. గాయపడిన కార్మికుడిని నిజామాబాద్ దవాఖానకు తరలించారు. రాకేశ్ తల్లి చెన్నమ్మ ఫిర్యాదు మేరకు సోన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కార్మికుడు నల్గొండ జిల్లాకు చెందిన వ్యక్తిగా తెలిసింది. పొట్టకూటి కోసం నిర్మల్ జిల్లా కేంద్రంలోని మంజులాపూర్‌లో నివాసం ఉంటున్నాడు.

## క్లిక్..క్లిక్..



కేస్లాపూర్ నుంచి పిట్టబొంగురంకు వెళ్లే దారి



ఎడ్లబండిలో వ్యవసాయ పనులకు వెళ్తున్న రైతు



చిత్తడిగా హర్కాపూర్ ఎక్స్‌రోడ్డు నుంచి కేస్లాపూర్‌కు వెళ్లే మట్టి రోడ్డు

# ఇవీ రోడ్లేనా?

### అడుగుకో గుంత.. వాహనదారులకు నరకం

*తాజాగా కురుస్తున్న వర్షాలకు బీటీరోడ్లతోపాటు మట్టిరోడ్లు కూడా చిత్తడిగా మారాయి. అంజీ, పిట్టబొంగురం, దస్నాపూర్, వడగాం, గిన్నేరా గ్రామాలకు చెందిన బీటీ రోడ్లు గుంతలతో అధ్వానంగా మారాయి. దీంతో వాహనదారులతోపాటు ప్రయాణికులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ద్విచక్ర వాహనాలతోపాటు ఆటోలు చెడిపోయి తాము ఆర్థికంగా నష్టపోతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎడ్లబండ్లతో ఎరువులు తరలించడానికి సతమతం అవుతున్నామని రైతులు పేర్కొంటున్నారు. గుంతలు ఏర్పడిన రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రజలతోపాటు వాహనదారులు కోరుతున్నారు.*

*- ఇంద్రవెల్లి, ఆగస్టు 11*



వాల్గొండ గ్రామంలోని అంతర్గత రోడ్డు